## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608



# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 285 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 21 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


### అమెరికా అధ్యక్షుడిగా

# ట్రంప్ ప్రమాణస్వీకారం

## 'అమెరికా ఫస్ట్' అనేదే నా నినాదం అంటూ తొలి ప్రసంగం



**వాషింగ్టన్, జనవరి 20 (ప్రభాత ఉదయం):** అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేశారు. వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన అతిథుల సమక్షంలో వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 10:30 గంటలకు రెండోసారి ఆయన అధ్యక్ష పదవీ బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ కంటే ముందుగా అమెరికా ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వేదిక వద్దకు ట్రంప్, జేడీ వాన్స్, జో బైడెన్, కమలా హారిస్ చేరుకున్నారు. ఈ వేడుకకు భారత్ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరయ్యారు. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ దంపతులు, ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్ బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథులు ఈ కార్యయక్రమానికి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించేందుకు యూఎస్ క్యాపిటల్ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. గతేడాది నవంబరులో జరిగిన ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించారు. ఆయనతో అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు. 1861లో

..మిగతా 2లో



## రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్

# కీలక ప్రకటన


**హైదరాబాద్, జనవరి 20 (ప్రభాత ఉదయం):** కొత్త రేషన్ కార్డుల పంపిణీపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రైషన్ కార్డుల గురించి ప్రజలు ఆందోళన చెందవద్దని అన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్: రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం జరుగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.తాము అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని స్పష్టం చేశారు. అప్పుడు బీఆర్ఎస్ మోసం చేసిందని.. ఇప్పుడు తాము ఇస్తుంటే అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. జాబితాలో పేర్లు రాని వాళ్లు ప్రజావాణి, గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ పూర్తి కాగానే ప్రతీ వ్యక్తికి 6కిలోల సన్నబియ్యం ఇవ్వబోతున్నామని ప్రకటించారు. కొత్త రేషన్ కార్డులపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. దేనిపై విమర్శలు చేయాలో తెలియక ప్రజల్లో పలుచన అవుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 40 వేలకు మించి రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

### ప్రియుడిని చంపిన

## ప్రియురాలికి ఉరిశిక్ష

**తిరువనంతపురం స్థానిక కోర్టు సంచలన తీర్పు**

**ఆమె నేరాన్ని తక్కువగా చేయరాదని భావించిన కోర్టు**



**తిరువనంతపురం, జనవరి 20 (ప్రభాత ఉదయం):** కేరళ రాజధాని తిరువనంతపురం కోర్టు మరో కీలక తీర్పు వెల్లడించింది. ప్రియుడిని చంపిన కేసులో ప్రియురాలికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. 2022లో కేరళలో విషం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి ప్రియుడు శరోన్ రాజ్‌ను ప్రియురాలు గ్రీష్మ చంపిన ఘటన సంచలన సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పూర్తి ఆధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన తిరవనంతపురం కోర్టు.. గ్రీష్మకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు వెలువరించింది. అంతేకాదు.. శరోన్ రాజ్‌ను చంపేందుకు గ్రీష్మకు సహకరించిన బంధువుకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. కేరళలో

..మిగతా 2లో

### మైనింగ్‌కు వ్యతిరేకంగా

# గ్రామస్థుల పోరుబాట

## మైలారం గ్రామంలో ఆందోళనకు దిగిన స్థానికులు

## ఆందోళనకారుల అరెస్ట్‌తో గ్రామంలో ఉద్రిక్తత



**నాగర్ కర్నూల్, జనవరి 20 (ప్రభాత ఉదయం):** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 'మైనింగ్ వద్దు.. గుట్ట ముద్దు' అనే నినాదంతో రైతులు నేటి నుంచి రిలే నిరాహార దీక్షలకు సన్నద్ధమయ్యారు. దీంతో పోలీసులు ముందస్తుగా పలువురు రైతులు, స్థానికులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ గ్రామానికి చెందిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ? గ్రామస్తులు పెద్ద ఎత్తున మహిళలు, రైతులు రోడ్డుపైకి చేరి నిరసనకు దిగారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన ఉధృతం చేశారు. గ్రామంలోనికి పోలీసులను రానీయకుండా ముళ్లకంచెలు వేశారు. మైలారం గ్రామస్తులు చేపట్టిన ఈ ఆందోళనకు మద్దతు తెలపడానికి హైదరాబాద్ నుండి బయలుదేరి వచ్చిన పౌరహక్కుల నేతలు ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్ లను కూడా పోలీసులు వెల్దండ వద్ద అడ్డగించి అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. దీంతో మైలారం గ్రామంలో ఉద్రిక్తత

..మిగతా 2లో



### దావోస్‌లో ఇద్దరు

## తెలుగు సిఎంల భేటీ

**హైదరాబాద్, జనవరి 20 (ప్రభాత ఉదయం):** స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్తుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు మంత్రులు హాజరయ్యారు. మంత్రులతో కలిసి దావోస్ పర్యటనకు వెళ్లిన సమయంలో అరుదైన కలయిక జరిగింది. జ్యూరిచ్ చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం.. అదే ఎయిర్ పోర్టులో అప్పటికే అక్కడ ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలుగు రాష్ట్రాల ఇద్దరు సీఎంలు, మంత్రులు ఒకే చోట కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. చిత్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, శ్రీధర్ బాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహనాయుడు ఉన్నారు. మంత్రి శ్రీధర్ బాబు భుజంపై చేతులేసి.. షేక్ హ్యాండ్ ఇస్తున్నారు సీఎం చంద్ర బాబు. ఉదయం జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో వీళ్ల మీటింగ్ జరిగింది.తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులపై లక్ష్యంగా.. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారుల బృందం దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైంది.

## కోల్‌కతా హత్యాచారం కేసు.. సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు



**బాధితురాలి కుటుంబానికి 17 లక్షల పరిహారం**

**సిల్దా కోర్టు సంచలన తీర్పు**

**కోల్‌కతా, జనవరి 20 (ప్రభాత ఉదయం):** కోల్‌కతా ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసుకు సంబంధించి దోషి సంజయ్ రాయ్ కి కోల్‌కతాలోని సిల్దా కోర్టు జీవిత ఖైదు శిక్ష వేస్తూ తీర్పు నిచ్చింది. ఈ కేసులో ఇప్పటికే విచారణను పూర్తి చేసిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. గత శనివారం సంజయ్ రాయ్ దోషి అని తేల్చింది. ఈ కేసులో సోమవారం తీర్పును వెలువరిస్తామని చెప్పిన కోర్టు.. తాజాగా అతడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పును ఇచ్చింది. ఇక సంజయ్ రాయ్ కి ఏం శిక్ష విధిస్తారని దేశం మొత్తం తీవ్ర ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా.. అతడికి జీవిత ఖైదు విధించారు. మరోవైపు ఇంత దారుణంగా హత్యాచారం చేసిన సంజయ్ రాయ్ కి ఉరిశిక్ష విధించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. కేసులో తీర్పు ఇవ్వడానికి ముందుగా సీల్దా కోర్టు జడ్జి జస్టిస్ అనిర్బన్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు అరుదైనది అని తాను భావించడం లేదని.. అందుకే

..మిగతా 2లో

## ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

**నేటి నుంచి గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ**



2



### అమెరికా అధ్యక్షుడిగా

# ట్రంప్ ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి...

అబ్రహాం లింకన్ ప్రమాణ స్వీకారం చేయించడానికి ఉపయోగించిన బైబిల్, తన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాగా, ప్రమాణ స్వీకారానికి ముందు జో బైడెన్‌ను కలిసేందుకు ట్రంప్ శ్వేత సౌధానికి వెళ్లగా.. ఆయనకు బైడెన్ దంపతులు సాదర స్వాగతం పలికారు. అనంతరం క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో జరిగే కార్యక్రమానికి బైడెన్, ట్రంప్ ఒకే వాహనంలో వెళ్లారు. ప్రపంచంలోని టెక్ దిగ్గజాలు, పారిశ్రామిక వేత్తలు సహా అమెరికా సుప్రీంకోర్టుకు చెందిన 9 మంది జడ్జిలు ఈ వేడుకకు హాజరయ్యారు.

**'అమెరికా ఫస్ట్' నినాదంతో..**

అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం అనంతరం ట్రంప్ తన తొలి ప్రసంగం చేశారు. 'అమెరికా ఫస్ట్' నినాదంతో ముందుకు వెళ్తామని చెప్పారు. అమెరికా అనేక ఆటుపోట్లను, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని నిలబడిందని.. దేశ సరిహద్దుల రక్షణ తమకు చాలా కీలకమని అన్నారు. 'శాంతి భద్రతల విషయంలో మరింత కఠినంగా ఉండాలి. అమెరికా విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి. అమెరికా పేరు నిలబెట్టేందుకు ప్రజలంతా ముందుకురావాలి. అమెరికాలో స్వర్ణయుగం ప్రారంభమైంది.' అని ట్రంప్ పేర్కొన్నారు.

# కోల్‌కతా హత్యాచారం కేసు.. సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

మొదటి పేజీ తరువాయి...

చనిపోయే వరకు జైలు శిక్ష అనుభవించాలని తీర్పును ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితురాలి తల్లిదండ్రులకు రూ. 17 లక్షల పరిహారం చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. 2023 ఆగస్ట్ 9వ తేదీ రాత్రి కోల్‌కతాలోని ఆర్జీకర్ హాస్పిటల్ సెమినార్ రూమ్‌లో నిద్రిస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, ఆపై హత్య జరగడం దేశంలో తీవ్ర సంచలనాన్ని రేపింది. మొదట కోల్‌కతా పోలీసులు ఈ కేసు విచారణ ప్రారంభించగా.. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో సీబీఐ రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలోనే స్పెషల్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ.. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే అందులో చేర్చింది. అయితే ఈ ఘటనలో సామూహిక అత్యాచారం విషయాన్ని ఛార్జిషీట్‌లో పేర్కొనలేదు. ఆర్జీకర్ మెడికల్ ఆస్పత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్ రాయ్ ని గతేడాది ఆగస్ట్ 10వ తేదీన కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో అరెస్ట్ అయిన ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇంఛార్జ్ అభిజిత్ మండల్‌లకు ఇప్పటికే బెయిల్ లభించింది. ఈ ఘటనలో సాక్ష్యాలు తారుమారు చేశారనే ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. అరెస్ట్ తర్వాత 90 రోజుల్లో పోలీసులు, సీబీఐ ఛార్జ్‌షీట్ ÷ల్ చేయకపోవడంతో వారికి బెయిల్ వచ్చింది. జంజర్రాయ్‌కు జీవిత ఖైదు శిక్ష విధించింది. అతడు మరణించే వరకు జైల్లోనే ఉంచాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. అలాగే సంజయ్‌రాయ్‌కు రూ.50 వేల జరిమానా సైతం కోర్టు విధించింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేసింది. అందులోభాగంగా మొత్తం120 మంది సాక్షులను సీబీఐ విచారించింది. దీంతో భారత న్యాయసంహిత చట్టంలోని సెక్షన్లు 64, 66,103/1 కింద సంజయ్‌కు జీవిత ఖైదు విధించింది. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలంటూ దేశవ్యాప్తంగా వైద్యులంతా ఆందోళనకు దిగారు. ఇక పశ్చిమ బెంగాల్ వైద్యులు అయితే.. తమ ఆందోళనలను మరింత ఉధృతం చేశారు. ఆ క్రమంలో వైద్య సేవలు సైతం నిలిచిపోయాయి. దీంతో వారితో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కానీ వైద్యులు.. తమ డిమాండ్లను మమతా బెనర్జీ ముందు ఉంచారు. కానీ వాటిలో కొన్నింటిని మాత్రమే ఆమె ఒప్పుకున్నారు. అనంతరం ప్రభుత్వం దిగి వచ్చి.. వైద్యులతో చర్చలు జరిపింది. అందుకు న్యాయం చేస్తామని.. అందుకు కొంత గడువు కోరింది. దీంతో వైద్యులు సానుకూలంగా స్పందించారు. కానీ ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చక పోవడంతో.. వైద్యులు మళ్లీ ఆందోళన బాట పట్టారు. మరోవైపు అత్యవసర సేవలకు ఎటువంటి అటంకం కలిగించమని వైద్యులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. ఇక ఈ హత్యాచార ఘటనపై ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్ సందీప్ ఘోష్ వెంటనే స్పందించారు. ఈ హత్యాచార ఘటనను ఆయన ఖండించారు. మృతురాలు తన కుమార్తెతో సమానమన్నారు. ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకూడదని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆ కొద్ది రోజులకే ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేశారు. ఆయితే ఆ వెంటనే ఆయన్ని మరో మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. క ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో సందీప్ ఘోష్ పై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కోర్టు జోక్యం చేసుకొని.. ఆయనను విధుల నుంచి తప్పించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం విదితమే. ఇక ఇదే తనను బలి పశువును చేశారంటూ నిందితుడు సంజయ్ రాయ్.. కోర్టుకు విన్నవించుకొన్నాడు. అంతేకాదు.. విధులకు హాజరైన ట్రైయినీ వైద్యురాలు.. రాత్రి 11.00 గంటల సమయంలో సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకొనేందుకు వెళ్లింది. ఆ ఉదయానికి ఆమె హత్యాచారానికి గురై విగత జీవిగా మారింది. అయితే సెమినార్ హాల్‌లో సీసీ టీవీ కెమెరాలు లేకపోవడం గమనార్హం.

# డ్రగ్స్ విక్రయిస్తున్న సాఫ్ట్వేర్ ఇంజనీర్ పట్టివేత

హైదరాబాద్,జనవరి20(ప్రభాత ఉదయం): నగరంలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.21 లక్షలు విలువైన 120 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అదనపు ఆదాయం కోసమే ఈ డ్రగ్స్ దందా చేస్తున్నట్లు వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. హైదరాబాద్‌లోని ఓ సంస్థలో పనిచేస్తున్నాడు. అదనపు ఆదాయం కోసం డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. మందస్తు సమాచారం అందుకున్న సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్, స్థానిక ఎక్సైజ్‌పోలీసులు.. పుణె నుంచి హైదరాబాద్‌కు వాహనంలో తీసుకొస్తున్న ఎండీఎంఏ కిస్టల్ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మొదట డ్రగ్స్‌కు బానిసయ్యాడని.. వస్తున్న జీతమంతా వాటికే ఖర్చు అవుతుండడంతో డ్రగ్స్ విక్రయించడం మొదలు పెట్టినట్టు పోలీసులు తెలిపారు. క్రమంగా తోటి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నాడని వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### మైనింగ్‌కు వ్యతిరేకంగా

# గ్రామస్థుల పోరుబాట

మొదటి పేజీ తరువాయి...




పరిస్థితి నెలకొంది. మైనింగ్ కు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసన కొనసాగుతోంది. అయితే రైతులు, గ్రామస్తులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. అక్రమ అరెస్టులు ఆపాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేసారు. గ్రామానికి పోలీసులు రాకుండా కంచె ఏర్పాటు చేశారు. మైలారం గ్రామంలో ఉండే గుట్టపై క్వార్ట్జ్ ఖనిజాలను మైనింగ్ చేసేందుకు అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా అక్కడ మైనింగ్ జరుగుతోంది. అనుమతుల నియమాలకు వ్యతిరేకంగా ఈ మైనింగ్ జరుగుతోందని పేర్కొంటూ గ్రామస్తులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేపట్టారు. మైనింగ్‌పై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని, గ్రామ తీర్మానం కూడా ఫేక్‌గా సృష్టించి మైనింగ్ జరుపుతున్నారని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేందుకు ఇటీవల హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ప్రొఫెసర్ హరగోపాల్ కూడా సంఘీభావం తెలిపారు. దీంతో సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని గ్రామ సభ తీర్మానించింది. దీనికి హరగోపాల్‌ను ముఖ్య అతిధిగా పిలిచారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు గ్రామానికి వచ్చి నిరసనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మహిళలు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా కంచె వేసి పోలీసులు రావద్దంటూ మహిళలు పురుగుల మందు డబ్బాలు పట్టుకుని నిరసన చేపట్టారు. చాలా కాలంగా మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మైలారం గ్రామంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. మైలారం మైనింగ్ వెలికితీత కార్యక్రమాన్ని నిలిపివేయాలని గత మూడు నెలలుగా ఆ గ్రామస్తులు శాంతియుత పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని మహిళలను, రైతులను అరెస్ట్ చేశారు. అలాగే అచ్చంపేటలో ఉన్న మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిని కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది.

### ప్రియుడిని చంపిన

# ప్రియురాలికి ఉరిశిక్ష

మొదటి పేజీ తరువాయి...

బాయ్‌ఫ్రెండ్‌ను 2022లో చంపిన గ్రీష్మ అనే యువతికి స్థానిక నెయ్యాట్టింకర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో మూడవ నిందితుడు, ఆమెకు సహకరించిన ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్‌కు కోర్టు మూడు సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. విద్యాపరమైన తన విజయాలు, గత నేర చరిత్ర లేకపోవడం, తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తెను కావడం వంటి కారణాలను పేర్కొని తనకు శిక్ష విధించడంలో కనికరం చూపాలని 24 ఏళ్ల దోషి కోర్టును అభ్యర్థించింది. అయితే, ఆమె క్రూర నేరానికి పాల్పడి, సాక్షాలను చెరిపివేసి, దర్యాప్తును తప్పుదోవ పట్టించిందని, ఆమె వయస్సును పరిగణనలోకి తీసుకోలేమని కోర్టు తన 586 పేజీల తీర్పులో స్పష్టం చేసినట్లు ప్రాసిక్యూటర్ వెల్లడించారు. తనతో రిలేషన్‌షిప్ ముగించేందుకు శరణ్ రాజ్ (23) ఒప్పుకోలేదని పెస్టిసైడ్ కలిపిన డ్రింక్ తాగించి అతనిని గ్రీష్మ చంపేసింది. ఆ ఘాతుకం జరిగిన సమయానికి ఆమె వయస్సు 22 సంవత్సరాలు. ఇక ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేయడానికి సందర్భోచిత, డిజిటల్, శాస్త్రీయ అంశాలపై ఆధారపడిందని కోర్టు పేర్కొన్నది. దోషి దశలవారీగా ఈ నేరం సాగించడానికి కుట్ర పన్నిందని, ఆమెకు నేర నేపథ్యం ఉందని, గతంలో ఆ యువకుని హత్యకు ప్రయత్నించిన ఆమె దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు అరెస్టు తరువాత తన ప్రాణం తీసుకునేందుకు ప్రయత్నించిందని కూడా కోర్టు పేర్కొన్నది. కాగా, ఇది అత్యంత అరుదైన కేసు అని, నిందితులకు ఉరిశిక్ష విధించాలని వాదించినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ విఎస్ వినీత్ కుమార్ మీడియాతో చెప్పారు. ఇది ఆదర్శప్రాయమైన ఒక తీర్పుగా ఆయన పేర్కొన్నారు. 2022లో గ్రీష్మ తన ప్రియుడు శరణ్ రాజ్‌కు పారాక్వాట్ అనే పెస్టిసైడ్ కలిపిన ఆయుర్వేద టానిక్‌తో విషం ఇచ్చింది. దానితో అతని శరీరంలోని పలు అవయవాలు విఫలం కావడంతో 11 రోజుల తరువాత అతను చనిపోయాడు. తమిళనాడుకు చెందిన ఆర్మీలో పని చేసే ఒక వ్యక్తితో తన పెళ్లి ఖాయం కావడంతో రాజ్‌తో తన అనుబంధాన్ని ముగించాలని ఆమె అనుకుంది. కానీ తమ సంబంధం ముగింపునకు అతను నిరాకరించడంతో హత్యకు గ్రీష్మ పథకం వేసింది. హతుడు శరణ్ రాజ్ తిరువనంతపురం జిల్లా పరశ్శల వాసి. హత్యతో సహా భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద గ్రీష్మ దోషిగా తేలింది. ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్ సాక్షాలను ధ్వంసం చేసిన కేసులో దోషిగా తేలాడు. అయితే, కస్టడీలోకి తీసుకున్న అతని తల్లి సాక్షాధారాలు లేకపోవడంతో నిర్దోషిగా విడుదల అయింది. కేసు దర్యాప్తును పర్యవేక్షించిన అప్పటి ఎస్పి డి శిల్ప కోర్టు తీర్పును స్వాగతిస్తూ, పోలీస్ దర్యాప్తు బృందం సమష్టి కృషికి ఇది విజయం అని అన్నారు.

# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ కుర్వ నల్ల హన్మంతు

### వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ కుర్వ నల్ల హన్మంతు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 20(ప్రభాత ఉదయం) ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ కుర్వ నల్ల హన్మంతు సూచించారు. కేటిదొడ్డి మండలం చింతలకుంట, నందిన్నె జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో, కేటిదొడ్డి కేజీబీవిలో పదోతరగతి విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రత్నసింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు రత్నసింహారెడ్డి మాట్లాడుతూ అమ్మమ్మ, తాతయ్యలు నైబాయి అనంతమ్మ, వేమారెడ్డి జ్ఞాపకార్థం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అక్షరాస్యతలో వెనుకబడిన కేటీదొడ్డి,గట్టు మండలంలో అక్షరాస్యత పెంచే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర రావు, ప్రధానోపాధ్యాయులు, కేజిబివి ఉపాధ్యాయులు, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



### ఇందిరమ్మ ఇళ్ల కోసం

# మరో అవకాశం

హైదరాబాద్,జనవరి20(ప్రభాత ఉదయం): కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి 21 నుంచి జరిగే గ్రామ సభల్లో వీటి కోసం అప్లికేషన్లు స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు సీఎస్ శాంతి కుమారి. దీనికి సంబంధించి గైడ్స్ లైన్స్ తో సర్క్యులర్ పంపించారు. గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడానికి దరఖాస్తులు స్వీకరించాలి. ఒకే కుటుంబం నుంచి వేరే పడ్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు ఇచ్చేందుకు అప్లికేషన్లు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాలను తీసుకోవాలని గైడ్ లైన్స్ లో స్పష్టం చేశారు.



కోరని మల్లేష్

# పనిచేస్తున్న చోట 5వ అంతస్థు నుంచి పడి ఓ యువకుడు దుర్మరణం

బుద్వేల్, జనవరి20(ప్రభాత ఉదయం): కిస్మత్‌పూర్–బండ్లగూడ మార్గంలో ఉన్న గిరిధారి అపార్ట్మెంట్ లో హౌస్ కీపింగ్ పనులు చేస్తున్న ఓ యువకుడు 5వ అంతస్థులో ఉండే నీటి సంపు ను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు క్రింద పడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి... ప్రేమావతిపేట్ కు చెందిన దివంగత కోరని రమేశ్ కుమారుడు కోరని మల్లేశ్ (27) బండ్లగూడ రహదారిలో ఉన్నటువంటి గిరిధారి అ పార్ట్మెంట్ 27 రోజులుగా హౌస్ కీపింగ్ పనులు చేస్తున్నాడు. మల్లేశ్ కు మూడు సంవత్సరాల క్రితం మీనా అనే యువతి తో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణీ గా ఉంది. మల్లేశ్ సోమవారం అపార్ట్మెంట్ లోని ఐదవ అంతస్తులో ఉన్న నీటి సంపును శుభ్రం చేస్తున్నాడు. ఐదవ అంతస్తు పిట్ట గోడకు ఎండ తగులకుండ ఏర్పాటు చేసిన రేకులపై కాలు పెట్టడంతో జారీ క్రింద పడిపోయాడు. ఈ సంఘటనలో మల్లేశ్ అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న బందువులు. కుటుంబ సభ్యులు గిరిదారి అపార్ట్‌మెంట్‌కు వెళ్లే లోపే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మల్లేశ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ కిషోర్ దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ ఈ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్లు




# విద్యా అర్హతను బట్టి విద్యుత్ ఆర్టిజన్లను కన్వర్ట్ చేయాలి

**మెహదీపట్నం, జనవరి 20(ప్రభాత ఉదయం) తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్‌ల అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సోమవారం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మెహదీపట్నం లోని నానల్ చౌరస్తాలో గల విద్యుత్తు సర్కిల్ కార్యాలయం ముందు బైఠాయించి టీజీస్పడీసీల్ లో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిసన్స్ ని విద్యుత్ అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో విద్యుత్ సైబరసిటీ, రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయాలలో పనిచేస్తున్న ఆర్టిజన్లు పాల్గొన్నారు.**

# కాలనీ ప్రజల మధ్య సత్సంబంధాలు మెరుగు పడటానికి సంస్కృతిక,క్రీడా పోటీలు ఉపయుక్తం







## భవాని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా,సాంస్కృతిక కార్యక్రమాలు..

### ఉత్సాహంగా పాల్గొన్న కాలనీవాసులు.. గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం..

రాజేంద్రనగర్,జనవరి20(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ భవాని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో స్థానికులు పాల్గొని సత్తా చాటారు.ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు భవాని కాలనీ ఫంక్షన్ హాల్ వద్ద పలు క్రీడా,సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.అందులో భాగంగా స్థానికులు పెద్ద సంఖ్యలో క్రీడల్లో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు.దీంతో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.క్యారమ్స్ విభాగంలో విన్నర్ సృజంత్ రెడ్డి,రన్నర్ కే మనోజ్,సీనియర్స్ విభాగంలో విన్నర్ ఏ వీరన్,రన్నర్ జి శ్రీనివాస్ యాదవ్,పురుషులు సీనియర్స్ విభాగంలో విన్నర్ ఆర్ కృష్ణ,రన్నర్ మల్లికార్జునరావు,చెస్ ఉమెన్ విభాగంలో విన్నర్ బిందు,రన్నర్ జీ రూప,చెస్ జూనియర్ విభాగంలో విన్నర్ అయాన్,రన్నర్ దేవాన్ష్,క్యారమ్స్ సీనియర్ సిటిజన్ విభాగంలో విన్నర్ గోవింద్ రాజు,రన్నర్ శ్రీనివాస్,రన్నింగ్ విభాగం గ్రూప్ 1 లో విన్నర్ జియా,రన్నర్ కరణ్,గ్రూప్ 2 లో విన్నర్ కరణ్,రన్నర్ సాగర్,గ్రూప్ త్రీ లో విన్నర్ అరుణ్,రన్నర్ లడ్డు,వాలీబాల్ విభాగంలో విన్నర్ చోటు అండ్ టీం,రన్నర్ మిస్టర్ నవీన్ అండ్ టీం,కిడ్స్ ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్లో విన్నర్ ఆర్ అద్విత,రన్నర్ ఎస్.కె జాహెద్,సింగింగ్ విభాగంలో విన్నర్ బి.మాధురి,రన్నర్ శ్రీదుర్గ,లెమన్ అండ్ స్పూన్ మహిళ సీనియర్ విభాగంలో విన్నర్ జుబేదా,రన్నర్ అనన్య,జూనియర్స్ విభాగంలో విన్నర్ నితిషా,రన్నర్ రుత్విక,బాలుర విభాగంలో విన్నర్ కార్తీక్ డి,రన్నర్ కే వివేక్,మ్యూజికల్ చైర్ విభాగంలో విన్నర్ జీ రూప,రన్నర్ నిర్మల,తంబోలా విభాగంలో మహిళల విభాగంలో విన్నర్ రూప,రన్నర్ నిర్మల,ఆస్మాబాను, శృతి, చిన్నారుల విభాగంలో విన్నర్ చైత్రీ కావలి,కౌశిక్,రన్నర్ నేతిక్,సాగర్,దీక్షిత,సాయి,కార్తీక్,పురుషుల విభాగంలో విన్నర్ పవన్,నరోత్తం,రన్నర్ జి శ్రీనివాస్,సాయికిరణ్,చంద్రకాంత్లు నిలిచినట్లుగా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అక్కెం కృష్ణ యాదవ్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇలాంటి కార్యక్రమాలు కాలనీలలో ప్రజల మధ్య ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ఐకమత్యమే కాలనీ బలమని వారన్నారు.కాలనీలో అందరూ ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని అన్నారు. అంతేకాకుండా ఇళ్లకే పరిమితం కాకుండా సాటి వారితో సత్సంబంధాలను మెరుగు పరచుకోవడానికి ఇదొక మంచి మార్గమని తెలిపారు.ఇలాంటి కార్యక్రమాల్లో కాలనీ సభ్యులు పాల్గొని సంతోషంగా గడపాలని అన్నారు.ఈ మేరకు సహకరించిన అసోసియేషన్ సభ్యులకు,కాలనీవాసులకు వారు ధన్యవాదాలు తెలిపారు.



## నేడు శివరాంపల్లి, కిస్మత్‌పూర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్, జనవరి 20(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి సెక్షన్ పరిధిలో గల వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరమత్రా నిమిత్తం మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ, బెస్ట్ ప్రైస్, ఖాద్రి హిల్స్, శ్రీదేవి కాలనీ, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు హసన్ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన హసన్ నగర్, బాబా నగర్, ఇంద్రానగర్, ఎన్టీఆర్ నగర్, సులేమాన్ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సులేమాన్ నగర్, ఖాజా హెూటల్, డైమండ్ సిటీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సరఫరా అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### కిస్మత్ పూర్ సెక్షన్ లో...

కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు శ్రీ సాయి కాలనీ, గవర్నమెంట్ స్కూల్, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్ఆర్ఐ టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకనంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓంనగర్ కాలనీ, ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2, సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్, కీర్తి విల్లాస్, డాన్ బోస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన మీ చల్ కాలనీ, వినాయక్ నగర్, డిడి కాలనీ, కాళీ మందిర్, ఎన్ఎఫ్సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయ నగర్, సంధ్యా నగర్, జి ఆర్ నగర్, మాచన్నపల్లి ఎంక్లేవ్, ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సరఫరా అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## చింతరేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి



చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 20 (ప్రభాత ఉదయం)ఫిబ్రవరి 1 న తేదీ నుంచి ప్రారంభంకానున్న ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఫిబ్రవరిలో నిర్వహించు బ్రహ్మోత్సవాలకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా పనులను ప్రారంభించాలన్నారు. ఆయా శాఖల వారు తమకు అప్పగించిన పనులను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ధర్మకర్త సి.గిరిరావు మాట్లాడుతూ... ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 7వరకు నిర్వహించు ఈ బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి అంకురార్పణ ధ్వజారోహణం, తెప్పోత్సవం, పల్లకిసేవ, రథోత్సవం, అలంకరణలు, అవభృత స్నానము, మధ్వనవమి,పల్లకి సేవ, స్వస్తివచనము తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, నాయకలు ప్రభాకర్ గౌడ్, కోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంది కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

### జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 20(ప్రభాత ఉదయం)జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన కంది పంటను కొనుగోలు చేసేందుకు వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో కందుల కొనుగోలుపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2024-25 వానకాలం సీజన్లో రైతులు పండించిన కందులను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలోని ఆలంపూర్, వడ్డేపల్లి, ఐజ, పుటాన్ దొడ్డి, గద్వాల మార్కెట్లలో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ముందుగా బుధవారం రోజున అలంపూర్, వడ్డేపల్లి మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కందులను కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు 7,550/- చొప్పున కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు నాణ్యమైన కందులను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, మార్క్ ఫెడ్ డిఎం గౌరీ నగేష్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, ఎస్ డబ్ల్యూ సి మేనేజర్ ఉపేందర్ వివిధ శాఖల సహాయ అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుండి సమస్యలపై వినతి పత్రాల స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

## ప్రజల నుండి స్వీకరించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ సంతోష్

### ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువ

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 20(ప్రభాత ఉదయం) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి (45) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సింగ్ రావు లతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికి అప్పడు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకర డ్రగ్స్‌ను చూపిస్తున్న అధికారులు

## మణికొండలో అక్రమ డ్రగ్స్ నిలువ స్థావరాలపై అధికారుల దాడులు

### జిమ్ మాదకద్రవ్యాల దుర్వినియోగం చేస్తున్నట్లు ప్రాథమిక అంచనా

### మణికొండ జాగీర్‌లో మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ల అక్రమ నిల్వను స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ అధికారులు

గండిపేట, జనవరి 20(ప్రభాత ఉదయం) తెలంగాణ యాంటీ-నార్కోటిక్స్ బ్యూరో (TGANB%) సహకారంతో, తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (DCA%), అక్రమంగా నిల్వ చేసి విక్రయించిన మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను మణికొండలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కార్డియాక్ స్టిమ్యులెంట్ డ్రగ్స్, బాడీబిల్డింగ్ ప్రయోజనాల కోసం జిమ్‌కు వెళ్లేవారు దుర్వినియోగం చేస్తున్నారని స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మణికొండ జాగీర్‌లోని భారీగా ఆకాష్ యాజమాన్యంలోని ప్రాంగణంలో ఈ దాడి నిర్వహించారు. జనవరి 18న మణికొండ జాగీర్‌లోని శివాజీ నగర్‌లో ఉన్న లైసెన్స్ లేని ప్రాంగణంలో అధికారుల బృందం దాడి చేసింది. అధికారులు టెర్మిన్ ఇంజెక్షన్లు , టెర్మివా ఇంజెక్షన్ల (మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు IP 30 mg/ml) అక్రమ నిల్వలను కనుగొన్నారు. ఈ దాడుల్లో మొత్తం 14 టెర్మివా వైల్స్ , 4 టెర్మిన్ ఇంజెక్షన్ల వైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### మెఫెంటెర్మైన్ సల్ఫేట్ దుర్వినియోగం...

మెఫెంటెర్మైన్ సల్ఫేట్ అనేది గుండెకు సంబంధించిన ఉద్దీపన, ఇది ప్రధానంగా వెన్నెముక అనస్థీషియా , శస్త్రచికిత్స సమయంలో తక్కువ రక్తపోటు (హైపోటెన్షన్) చికిత్సకు వైద్యపరంగా ఉపయోగించబడుతుంది. నోరాడ్రినలిన్ విడుదలను పెంచడం ద్వారా, ఈ ఔషధం గుండె ఉత్పత్తిని పెంచుతుంది. రక్తపోటును వేగంగా పెంచుతుంది అయితే, బాడీబిల్డింగ్ , ఓర్పు కోసం పనితీరును పెంచేదిగా జిమ్‌లలో దీని దుర్వినియోగం తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తింది. పోటీ క్రీడలు , బాడీబిల్డింగ్‌లో శారీరక పనితీరును మెరుగుపరచడానికి జిమ్‌కు వెళ్లేవారు ఈ ఔషధాన్ని చట్టవిరుద్ధంగా పొందుతున్నారు, దీని దుర్వినియోగంతో సంబంధం ఉన్న తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను విస్మరిస్తున్నారు.

### దుర్వినియోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలు

మెఫెంటెర్మైన్ సల్ఫేట్ క్రమబద్ధీకరించని ఉపయోగం ప్రమాదకరమైన దుష్ప్రభావాలకు దారితీస్తుందని అధికారులు తెలిపారు. మానసిక వ్యాధి,హృదయ సంబంధ రుగ్మతలు,సహనం, ఆధారపడటం అభివృద్ధి, చట్టపరమైన పరిణామాలు ఈ ఔషధాల అక్రమ నిల్వ, అమ్మకం డ్రగ్స్, కాస్మెటిక్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తుందని, ఇలాంటి వారికి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని అధికారులు హెచ్చరించారు.



బుద్వేల్‌లో పునర్నిర్మించిన అమ్మ వారి దేవాలయం

## ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు

బుద్వేల్, జనవరి 20(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ లో పురాతన అమ్మవారి దేవాలయాన్ని పునర్నిర్మారణం చేసి దేవతామూర్తులను ప్రతిష్టించడానికి ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు బుద్వేల్ బస్తీ పెద్దలు తెలిపారు. ఈ దేవాలయంలో శ్రీ నాగదేవత, శ్రీ ఈదమ్మ తల్లి, మాందాత అమ్మవారు, శ్రీ భద్రకాళీ అమ్మవారు, వీరభద్ర సింహవాహన, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలి పారు. ఈ నెల 30వ తేదీన గ్రామోత్సవ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రతిష్టాపన చేయనున్న విగ్రహములను బుద్వేల్ బస్తీ పురవీధుల లో ఊరేగింపు చేయడం జరుగుతుందన్నారు. 31వ తేదీన శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి మహా గణపతి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గోమాత పూజ. యాగశాల ప్రవేశం. ద్వజారోహణం. ఆఖండ దీపారాధన లాంటి పూజలు ఉంటాయన్నారు. ఫిబ్రవరి ఒకటవ తేదీలలో పూజలు ఉంటాయని, రెండవ తేదీన విగ్రహాల ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు ఉంటాయన్నారు. బుద్వేల్ కు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ పూజలలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.




రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం పాలక వర్గ సభ్యులు

## రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా సి.బుచ్చిరెడ్డి

రాజేంద్రనగర్, జనవరి 20(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్దేవుపల్లి డివిజన్ లో గల టీఎన్జీవోస్ కాలనీ, మధుబన్ కాలనీ, పద్మశాలిపురం బస్తీలకు చెందిన రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం అధ్యక్షులుగా సి.బుచ్చిరెడ్డి నియమితులైనారు. సోమవారం టీఎన్జీవోస్ కాలనీలో గల సంఘం కార్యాలయంలో రెడ్డి సంక్షేమ పొదుపు సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్ భూపతిరెడ్డి, కోశాధికారిగా ఎం. నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా కె. రాజవర్ధన్ రెడ్డి , ఎల్.వెంకటేశ్వర్ రెడ్డి, ఇ.పాండురంగారెడ్డి, బి.గోవర్దన్ రెడ్డి, ఎం.క్రిష్ణారెడ్డిలు నియమితులైనారు. ప్రచార కార్యదర్శిగా సి.రామక్రిష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ఎ.సుఖేందర్ రెడ్డి , సలహాదారులు ఎ.మీనారెడ్డిలు ఎన్నికైనారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం అధ్యక్షులు సి.బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, సుఘంలోని ప్రతి సభ్యుడు బాధ్యాతాయుతంగా పొదుపు చేసి కుల బాంధవులకు అండగా నిలవాల్సిన అవసరం ఉం దన్నారు. సమాజ హితం కోసం పాటుపడే రెడ్డి బందువులు సంఘం అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు.




క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

బుద్వేల్, జనవరి 20(ప్రభాత ఉదయం) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి గాను రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను సోమవారం మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. ఉ పాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీయుపీఎస్) రాజేం ద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి గుంజరి బాలక్రిష్ణ, మండల మహిళ కన్వీనర్ ముద్దం విజయమ్మ, ఉపాధ్యక్షురాలు ఓ నాగరాణి, కోశాదికారి అవుల ఆనీల్ తదితరులు పాల్గొన్నారు.



## ఐదవ తరగతి గురుకుల ప్రవేశానికి ఉచిత శిక్షణ

కొత్తకోట, జనవరి 20(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్ర భవనంలో జే.ఎస్.రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఐదవ తరగతిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కొరకు విద్యార్థిని విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫౌండేషన్ నిర్వాకులు స్టడీ మెటీరియల్,నోట్ పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్స్, విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అమృతరాజు మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని పోటీ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ఇంత మంచి అవకాశాన్ని ఉపయోగించుకుని చదువుకు అధిక ప్రాధాన్యత నివ్వాలని, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు పొందాలని మీ తల్లిదండ్రుల యొక్క పేరు నిలబెట్టాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ నిర్వహిస్తున్న సి.ఏ అనిల్, జే అనిల్ ను , నిర్వాహకులు సతీష్ రాజు, దయానందరాజు,మహిమ రాజు,కర్ణ కుమార్,మోహన్, కళ్యాణ్,లు అభినందించారు.




తమ సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

## ఆశలకు పెండింగ్లో ఉన్న ఆరు నెలల పిఆర్సి ఏరియర్స్ చెల్లించాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ డిమాండ్**

కొత్తకోట, జనవరి 20(ప్రభాత ఉదయం) మదనాపురం ఆశ కార్యకర్తలకు 2021 జులై నుండి డిసెంబర్ వరకు ఆరు నెలల పిఆర్సి ఏరియర్స్ వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు .సోమవారం మదనాపురం ఆస్పత్రి వద్ద ఆశ కార్యకర్తలు ప్ల కార్డులు పట్టుకొని నిరసన తెలిపి డాక్టర్ కు వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశలకు పనివారు తగ్గించాలని పారితోషకం లేని పనులు చేయించకూడదని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు చెల్లించాలని ఇస్తున్న పారితోషకాలలో సగం పెన్షన్ నిర్ణయించాలని డిమాండ్ చేశారు .ఫిక్స్ వేతనం 18 వేలు నిర్ణయించి ఇవ్వాలని కోరారు. ఆశ వర్కర్ల పలు సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 21న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే పాదయాత్రలో ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జ్యోతి, గంగ, భాగ్య, నాగమణి ,స్వాతి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.



## గాంధీ విగ్రహం దగ్గర ఉన్న జాతీయ జెండాను అధికారులు ఎలా తొలగిస్తారు

**అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కూకట్పల్లి,జనవరి 20 (ప్రభాత ఉదయం) తన సొంత పైసలతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ఆ విగ్రహం వద్ద ఉన్న జాతీయ జెండా ను ఎలా తొలగిస్తారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జిహెచ్ఎంసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కెపిహెచ్బి కాలనీ ఒకటవ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండా దిమ్మకు ఎగిరేయకుండా దిమ్మపోలును జిహెచ్ఎంసి అధికారులు కట్ చేశారు దాని పక్కనే ఉన్న కాంగ్రెస్ దిమ్మెకి జాతీయ జెండాను పెట్టడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జిహెచ్ఎంసి అధికారులను ప్రశ్నించారు. అధికారుల ధోరణి మార్చుకోకపోతే బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని ఇకనైనా పక్కన ఉన్న కాంగ్రెస్ దిమ్మెను తొలగించి విగ్రహం ఏర్పాటు చేసిన రోజు ఉన్న పాత దిమ్మకు జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు,మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీష్ అరోరా, కృష్ణారెడ్డి,రాజేష్ రాయ్, సాయి, గోపి ఎర్రబెల్లి సతీష్ రావు, వెంకటేష్ చౌదరి,పృథ్వి,తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ న్యాయవాది రాజబాబు గౌడ్‌కు పితృవియోగం



శంషాబాద్, జనవరి 20( ప్రభాత ఉదయం) గగన్ పహాడ్ కు చెందిన రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది పంతంగి రాజబాబు గౌడ్ తండ్రి బాబయ్య గౌడ్ సోమవారం మృతి చెందారు. 94 సంవత్సరాల వయసులోనూ చలాకీగా ఉండే ఆయన ఇటీవల కాలుజారి పడిపోవడంతో ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతున్న ఆయన సోమవారం ఉదయం తుది శ్వాస వదిలారు . బాబయ్య గౌడ్ అంత్యక్రియలను గగన్ పహాడ్ లోని స్మశాన వాటికలో నిర్వహించారు . ఆయన మరణ వార్త తెలిసిన బంధుమిత్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులు మల్లారెడ్డి. మొంద్ర కొమరయ్య. మల్లేష్ యాదవ్. జోగు రవి. కాంగ్రెస్ నాయకులు వెంకటేష్. జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి. రాజేంద్రనగర్ బారాసోసియేషన్ అధ్యక్షుడు గూడెపు రాజేందర్. న్యాయవాదులు పగడాల సిద్దేశ్వర. శ్రీనివాస్. రాజేంద్రనగర్ ప్రముఖులు పుంజాల అశోక్ కుమార్ గౌడ్. నందన్ గౌడ్ . సీనియర్ పాత్రికేయులు బొడ్డు మనోహర్. శివ చరణ్ గౌడ్. తదితరులు బాబయ్య గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ఇండ్ల స్థలాలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదు పత్రాన్ని చూస్తున్న ఉలిగేపల్లి గ్రామస్తులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 20(ప్రభాత ఉదయం): గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, లబ్ధిదారులకు ఇచ్చిన ప్లాట్లను తిరిగి ఇవ్వాలని సోమవారం ఉలిగేపల్లి గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ కు, జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ టి.శ్రీనివాస్ రావులకు విన్నతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ... మల్దకల్ మండలం ఉలిగేపల్లి గల సర్వే నంబర్ 102, 103 లో సుమారు 85 మంది నిరుపేదలకు 1995వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఇండ్ల స్థలాలు పంపిణి చేసిందన్నారు. ఉలిగేపల్లి గ్రామానికి చెందిన తిమ్మయ్య అనే వ్యక్తి తనకు ఇచ్చిన ప్లాట్లలో ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. కాగ లబ్దిదారులకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను కబ్జా చేసుకుని అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని, లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టొదని వారించగా బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అంతే కాకుండా ఇప్పటికే 10 ప్లాట్లను ఆక్రమించుకొని పశువుల దొడ్డి ఏర్పటు చేసుకున్నాడన్నారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేసి నిజమైన పట్టాదారులకు ప్లాట్లు అందజేయాలని జిల్లా ఉన్నతాధికారులను కోరినట్లు వారు తెలిపారు. కబ్జాదారుల నుండి ప్రభుత్వ స్థలాలను కాపాడి కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లకు ఫిర్యాదు చేసినట్లు లబ్దిదారులు వెల్లడించారు.

## ఆలయాల ఈఓను వెంటనే సస్పెండ్ చేయ్యాలి

**ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్**




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 20 (ప్రభాత ఉదయం)గత కొన్ని సంవత్సరాల నుండి జిల్లాలోని అలంపూర్ లోని శ్రీ జోగుళాంబ అమ్మవారి ఆలయం, జమ్మిచేడులోని శ్రీజమ్ములమ్మ ఆలయం , వెంకటాపురంలోని శ్రీపాగుంట వెంకటేశ్వర స్వామి ఆలయాలలో ఈఓగా విధులు నిర్వహిస్తున్న పురేందర్ అవినీతికి పాల్పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఈఓను సస్పెండ్ చేయాలని ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఓ ప్రకటనలో ఈవో పురేందర్ పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. జిల్లాలోని ప్రముఖ దేవాలయాల ఈఓగా విధులు నిర్వహిస్తున్న పురేందర్ అవినీతికి పాల్పడుతూ, అడ్డగోలుగా ఆస్తులు సంపాదిస్తూ, ఆలయాలలో భక్తులు ఇచ్చే కానుకలకు లెక్క, పత్రం లేకుండా, అభివృద్ధి ముసుగులో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బ్రహ్మోత్సవాల సమయాలలో భక్తులకు సరైన మౌలిక సదుపాయలు కల్పించకుండా కేవలం అధికార , రాజకీయ నాయకులకు రాచ మర్యాదలు చేస్తూ అధికారిగా కాలం వెల్లడిస్తున్నారని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహారిస్తూ, అధికార దుర్వినియోగం చేస్తూ, ఉద్యోగం ముసుగులో రాజకీయాలు చేస్తూ భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు స్పందించి ఈఓ పై విచారణ జరిపి సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు. తొందర లోనే రాష్ట్ర దేవాదాయ మంత్రికి మరియు దేవాదాయ కమీషనర్ కు పిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాము, దౌలత్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మిస్తాం: ఎమ్మెల్యే జిఎంఆర్



శంకరంపేటలో గ్రామపంచాయతీ నూతన భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



విలియం కొండ గ్రామంలో నూతన పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

కొత్తకోట, జనవరి 20(ప్రభాత ఉదయం) నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీకి భవనాలు నిర్మించడానికి కృషి చేస్తానని దేవరకద్ర నియోచేస్తానని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. సోమవారం కొత్తకోట మండలం విలియం కొండ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ నిర్మించిన భవనాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... త్వరలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. స్థానికంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్న నాయకులకు ప్రజలు ఎన్నుకోవటానికి మొగ్గు చూపుతారని ఆ దిశలో నాయకులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్,సిడిసి చైర్మన్ గొల్ల బాబు, మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మదనాపురం మండలంలో...**

మదనపురం మండలం శంకరంపేట గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ. జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు .అనంతరం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ కుమార్ తల్లి జ్ఞాపకార్ధ కూడిక కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొని నివాళులు అర్పించారు.



కార్యాలయం ప్రారంభిస్తున్న కూకట్పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి

## క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోంది

**కూకట్పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి**

**హౌసింగ్ బోర్డ్‌లో కూకట్ పల్లి నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ కార్యాలయం ప్రారంభం**

కూకట్పల్లి,జనవరి 20 (ప్రభాత ఉదయం) చైర్మన్ తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనల్స్ కార్పొరేషన్ దీపక్ జాన్ ఆశీర్వాదంతో కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ పర్యవేక్షణలో కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. క్రిస్టియన్ మైనార్టీ కోఆర్డినేటర్ క్రిష్టఫర్ ని సన్మానించి శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి డివిజన్లో క్రిస్టియన్ కమిటీలు నియమించి కాంగ్రెస్ పార్టీకి క్రిస్టియన్ మైనార్టీ కి వారధిగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హౌసిటోచర్, జాన్, ఫణీంద్ర కుమార్, కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, అర్ ఏ పాల్, పొడుగు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



డి ఈ శివశంకర్‌కు డైరీ అందజేస్తున్న అకౌంట్స్ ఆఫీసర్ అసోసియేషన్ ప్రతినిధులు

## డి ఈ శివశంకర్‌కు డైరీ అందజేసిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్ అసోసియేషన్ ప్రతినిధులు

మెహదీపట్నం, జనవరి 20(ప్రభాత ఉదయం) విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మెహదీపట్నం నానల్ నగర్ చౌరస్తాలో గల విద్యుత్ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ డి ఈ (టెక్నికల్) ఏం శివశంకర్ ను కలిసి డైరీ ని అందజేశారు. విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మురళీధర్ గౌడ్ ఆధ్వర్యంలో 2025 ను నూతన సంవత్సరం డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శేఖర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ లు రాజేష్, కృష్ణయ్య ,మంజుల, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు చంద్రశేఖర్, మాధురి, సుధా పరిమళ లు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608